# అమెరికాలో ఆరిపోని "తెలుగు జ్యోతి" రఘునాథ్

- డా. జె. బాపురెడ్డి

డా. కిడాంబి రఘునాథ్ హఠాన్మరణ వార్త నమ్మలేకపోయాను. అక్టోబర్ 25 నాడు జరిగిన దుర్ఘటన, ఆంధ్రప్రదేశ్‌లోని ఆయన అగణిత మిత్రకోటి పాలిటి ఆశనిపాతం అయింది. భారత-అమెరికా దేశాలమధ్య మైత్రీ బంధాన్ని పటిష్ఠం చేస్తున్న సాంస్కృతిక రాయబారిగా కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించాడు ఆయన. అమెరికాలో భారతీయత ఎత్తిన తెలుగు జండాగా భాసించాడు. వృత్తిరీత్యా ప్రతిభావంతుడైన సృజనశీలి, పారిశ్రామికవేత్తగా ఎంతగా రాణించాడో, ప్రవృత్తిరీత్యా తెలుగు సాహిత్య, సాంస్కృతిక వికాసానికి అంతగా అంకితమైన మానవతా వాదిగా జీవించాడు. ఆయనను నేను ఇటు ఆంధ్రప్రదేశ్, అటు అమెరికాలో ఎన్నోసార్లు కలిసికొని పంచుకున్న ఆత్మీయానుభూతులు మరుపురానివి.

చెరగని చిరునవ్వు తన చిరునామాగా, స్నేహహస్తం తన ఆస్తిపాస్తులుగా వెలుగొందిన తెలుగు చైతన్యం ఆయన. తెలుగు పలుకు, తెలుగు తనం తెలుగు సాంస్కృతులతో ముడివడినవి ఆయన వేషభాషలు, ఆశలు, ఆశయాలు, ఆదర్శాలు, తానా, ఆటా, ఈటా ఏదైనా ఆయన అందరికీ ఆత్మబంధువే. ఆయన వెలిగించిన "తెలుగు జ్యోతి" ఒక పత్రిక మాత్రమేకాదు, విశ్వవ్యాప్తమౌతున్న తెలుగు వెలుగులకు అక్షరరూపం.

తెలుగు ఫైన్ ఆర్ట్ సొసైటి (TFAS) ద్వార, ఆయన అందించిన నిస్వార్థ సేవలు, లోకోపకారవదాన్యత ఆదర్శప్రాయాలు అభినంద నీయాలు. క్రియాశీలి, కార్యదక్షుడు, దైవభక్తుడు, దేశభక్తుడూ అయిన కీర్తిశేషులు కిడాంబి రఘునాథ్ గారి వ్యక్తిత్వాన్ని, జీవిత తత్వాన్ని సంస్మరించడానికి "తెలుగు జ్యోతి" ప్రత్యేక సంచికను వెలువరుస్తున్నందుకు TFAS వారిని ముఖ్యంగా ఆయన - ఆప్తమిత్రులు తెలుగు సంస్కృతి ప్రదీప్తులు శ్రీ మూర్తిభావరాజు గారు, శిరోమణి వంశీరామరాజుగారు ప్రశంసనీయులు.